

సమస్యల్లో బోధన్ రైల్వేస్టేషన్

ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోధన్ రైల్వేస్టేషన్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



చినుకు పడితే చిత్తడే!

చిన్నపాటి వర్షానికే మాధవనగర్ రైల్వేగేట్ వద్ద రోడ్డు పూర్తిగా చిత్తడిగా మారుతోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.6 /23.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురియవచ్చు. సాయంత్ర ఈదురుగాలులతో భారీ వర్షం పడే అవకాశముంది.

ఇందూరుకు పసుపు బోర్డు!

- జమిలి ఎన్నికల ప్రయత్నాల నేపథ్యంలో గేర్ మార్చిన బీజేపీ
- ఇందూరు నుంచే ఉత్తర తెలంగాణపై భారీ ఫోకస్
- పసుపు బోర్డుతో పాటు శుద్ధి కర్మాగారం కోసం ప్రణాళిక?
- ఇటీవల గ్రీస్ పర్యటనలో నిజామాబాద్ పసుపు పంటపై ప్రధాని మోదీ ప్రస్తావన
- బోర్డు ప్రారంభోత్సవానికి మోదీ, అమిత్‌షాల్లో ఒకరు హాజరయ్యే అవకాశం
- కేంద్రానికి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ అర్వింద్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 4వ తేదీన ఎంపీ అర్వింద్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిశారు. ఉత్తర తెలంగాణపై బీజేపీ నాయకత్వం భారీ ఫోకస్ పెట్టిన నేపథ్యంలో ఇందూరు నుంచే దూకుడు ప్రారంభించాలనే చర్చ జరిగింది. ఈ క్రమంలోనే పసుపు బోర్డు విషయమై కీలక చర్చ జరిగినట్లు సమాచారం. దీంతో వెంటనే పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఢిల్లీ నుంచి వార్తలు వచ్చాయి. ఈనెల 18 నుంచి 22 వరకు జరుగనున్న పార్లమెంట్ సెషన్స్ నేపథ్యంలోనే పసుపు బోర్డు ప్రకటన వెలువరించనున్నట్లు ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. పసుపు బోర్డు ప్రారంభించేందుకు నిజామాబాద్‌కు ప్రధాని మోదీ కానీ, హోంమంత్రి అమిత్‌షా కానీ రానున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే నిజామాబాద్ ప్రాంతంలో పండించే పసుపు విషయమై ప్రధాని మోదీ ఇటీవల గ్రీస్ పర్యటనలో ప్రస్తావించడం గమనార్హం.

డబుల్ బొనాంజా..

భారత ప్రభుత్వం పసుపు బోర్డుతో పాటు జిల్లాలో పసుపు శుద్ధి కర్మాగారం కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీన్ని పూర్తిగా భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఇక్కడి పసుపును పూర్తిగా శుద్ధి చేసి నేరుగా జిల్లా నుంచే ఎగుమతి చేసేందుకు వీలుగా కర్మాగారం నెలకొల్పేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

దశలవారీగా..

తాజాగా పసుపు బోర్డు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నప్పటికీ, పసుపు ధర, ఎగుమతులు తదితరాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం దశలవారీగా అడుగులు వేస్తూ వచ్చింది. 2020లో ఎంపీ అర్వింద్ చొరవతో నిజామాబాద్‌లో 'సుగంధ ద్రవ్యాల బోర్డు' రీజినల్ ఆఫీస్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి రూ.30 కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఎగుమతులు కూడా పెంచారు. తర్వాత కర్కుమిన్ ఆధారిత పసుపు మార్కెటింగ్ కోసం దేశంలోనే మొదటిసారిగా నిజామాబాద్ మార్కెట్‌లో 2021లో నాంది పలికారు. కర్కుమిన్ శాతాన్ని స్థానికంగానే తెలుసుకునేందుకు గాను నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో కేంద్ర ప్రభుత్వ 'సుగంధ ద్రవ్యాల బోర్డు' పూర్తి సబ్సిడీతో రూ.50 లక్షల విలువైన 'కర్కుమిన్ టెస్టింగ్ మెషిన్' ఏర్పాటు చేసింది. ఈ మెషిన్‌లోని సాఫ్ట్‌వేర్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'తో పనిచేస్తోంది. ఈ యంత్రాన్ని ఇంటర్‌నెట్‌కు అనుసంధానం చేయడంతో ఆన్ చేయగానే సదరు కంపెనీకి తెలుస్తుంది. దీంతో దీని ద్వారా చేసే ప్రతి శాంపిల్ పరీక్ష 'క్లౌడ్ టెక్నాలజీ' ద్వారా యంత్రం తయారీ కంపెనీకి తెలుస్తుంది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్‌లో ఏదైనా సమస్య వస్తే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆన్‌లైన్ ద్వారానే సదరు కంపెనీ సరిచేస్తుంది. ఈ యంత్రంలో పసుపు పొడిని వేసి కేవలం 2 నిముషాల్లోనే 'కర్కుమిన్' శాతాన్ని తెలుసుకుంటున్నారు. నిజామాబాద్‌లో దీని పనితీరు సక్సెస్ కావడంతో ఇటీవల మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోనూ ఏర్పాటు చేశారు. మరోవైపు పసుపులో తేమ శాతం తెలుసుకునేందుకు 2022లో నిజామాబాద్ మార్కెట్ యార్డులో జర్మనీ నుంచి తెచ్చిన యంత్రాన్ని ఏర్పాటు చేశారు. పసుపు కొమ్ములను దంచి ముక్కలను ఇందులో వేస్తే, దీని ద్వారా 5 నిమిషాల్లో పసుపులో తేమ శాతం తెలుస్తుంది. 2021లో నిజామాబాద్ నుంచి నేరుగా బంగ్లాదేశ్‌కు పసుపు ఎగుమతి చేయడం గమనార్హం. తాజాగా పసుపు బోర్డు, పసుపు శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో ప్రక్రియ పూర్తి అయినట్లేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిజామాబాద్ మార్కెట్‌కు 7.49 లక్షల క్వింటాళ్ల పసుపు

తెలంగాణ వ్యాప్తంగా గత సీజన్‌లో సుమారు 8.80 లక్షల క్వింటాళ్ల పసుపు దిగుబడి వచ్చింది. ఇందులో అత్యధికంగా నిజామాబాద్ మార్కెట్‌కు 7.49 లక్షల క్వింటాళ్లు వచ్చింది. మిగిలిన పసుపు వరంగల్, కేసముద్రం, వికారాబాద్ మార్కెట్లకు వచ్చింది. 5శాతం పసుపు మాత్రం మహారాష్ట్రకు వెళ్లింది. తెలంగాణ వ్యాప్తంగా 2021 సీజన్‌లో 85,916 ఎకరాల్లో పసుపు సాగు చేయగా, 2022 సీజన్‌లో 56,073 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. రాష్ట్రంలో మొత్తం పసుపు సాగులో 40 శాతం నిజామాబాద్ జిల్లాలోనే కావడం గమనార్హం. తర్వాతి స్థానాల్లో జగిత్యాల, నిర్మల్, వికారాబాద్, మహబూబాబాద్ ఉన్నాయి.

మరిన్ని ఎంపీ సీట్లు గెలిచేందుకు ఎత్తుగడ

జమిలి ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన నేపథ్యంలో దక్షిణాదిలో కర్ణాటక తర్వాత ఎక్కువ ప్రాబల్యం ఉన్న తెలంగాణపై బీజేపీ మరింత ఫోకస్ పెట్టింది. తెలంగాణ నుంచి బీజేపీ నాయకత్వం ఈసారి మరిన్ని ఎంపీ సీట్లను గెలుచుకునే దిశగా ప్రణాళికలు తయారు చేస్తోంది. కాగా గత ఎన్నికల్లో రాష్ట్రంలో 4 ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీ, అందులో మూడు సీట్లను ఉత్తర తెలంగాణనుంచే గెలుచుకుంది. గత ఎన్నికల్లో పసుపు బోర్డు అంశం సీఎం కేసీఆర్ కుమార్తె కవితకు ఓటమి రుచి చూపించింది. తాజాగా కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటుకు నిర్ణయించడంతో రాజకీయంగా మరింత ప్రభావం చూపనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీని ప్రారంభానికి మోదీ, అమిత్‌షాలలో ఒకరు రానుండడంతో ఉత్తర తెలంగాణపై బీజేపీ ఏ స్థాయిలో ఫోకస్ పెట్టిందో అర్థం చేసుకోవచ్చు.

చరిత్రాత్మక విషయం..



నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మక విషయం. పసుపు రైతులకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగం. అదేవిధంగా కేంద్రం అదనంగా పసుపు శుద్ధి కర్మాగారం సైతం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేస్తోంది. ఇందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ధన్యవాదాలు. – ధర్మపురి అర్వింద్, ఎంపీ

న్యూస్‌రీల్

సదరం క్యాంప్‌ల తేదీలు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్) : సెప్టెంబర్ మాసంలో సదరం క్యాంప్‌లు నిర్వహించడానికి తేదీలు ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 20, 27 తేదీల్లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యాంప్‌లు ఉంటాయన్నారు. కాబట్టి ఈనెల 8వ తేదీన మీ సేవ కేంద్రాల్లో ఉదయం 11:30 గంటలకు స్లాట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. రసీదులో సూచించిన తేదీల్లో సదరం క్యాంప్‌నకు తగు ధ్రువపత్రాలు వెంట తీసుకుని హాజరుకావాలన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 84వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్ నుంచి 21గేట్లను ఎత్తి 75 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతోంది. వరద కాలువ ద్వారా నీటి విడుదలను నిలిపేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో అంతేస్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉంది. స్థానిక జల విద్యుదుత్పత్తి కేంద్రంలో 4 టర్బయిన్‌ల ద్వారా 36.28 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది.

నిజాంసాగర్ నుంచి..

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 42 వేల క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. ప్రాజెక్టు 5 గేట్ల ద్వారా 42 వేల క్యూసెక్కులను మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

గోదావరిలో పెద్ద చేపలు



బాల్కొండ : ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ఆ నీటిలో పెద్దపెద్ద చేపలు గోదావరిలోకి ఉరకలు వేస్తున్నాయి. దీంతో జాలర్లకు పెద్దపెద్ద చేపలు వలలకు దొరుకుతున్నాయి. సోన్‌పేట్ మత్స్యకారులకు 10 కిలోల పైన ఉన్న చేపలు బుధవారం చిక్కాయి. ప్రాజెక్ట్ నుంచి పెద్ద చేపలు దిగువకు గోదావరిలో కలిసిపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ దరఖాస్తులు 4,088

నిజామాబాద్ అర్బన్ : విద్యాశాఖలోని టీచర్ల బదిలీలకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా 4,088 మంది టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు 350 మంది ఉన్నారు. 3,665 మంది దరఖాస్తులను పరిశీలించారు. 73 దరఖాస్తులను పరిశీలన చేయాల్సి ఉంది. దరఖాస్తు గడువు ఈనెల 5వ తేదీన ముగియడంతో విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లోసమర్పించిన దరఖాస్తులను ఎంఈవోల ద్వారా పరిశీలన చేస్తున్నారు. ఇలా రెండుమార్లు వచ్చిన దరఖాస్తులు ఎక్కువగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఇందులో అదనంగా ఉన్న దరఖాస్తులను తీసివేసి ఖచ్చితమైన దరఖాస్తులను లెక్కించనున్నారు. ఈ ప్రక్రియ నేటితో ముగిస్తుంది. ఈరోజు దరఖాస్తులకు సంబంధించిన వివరాలను వెల్లడి కానున్నాయి.

ప్రత్యేక బృందం ఏర్పాటు

ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులకు సంబంధించి జిల్లా విద్యాశాఖ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. జిల్లాలోని సీనియర్ హెచ్‌ఎంలను ఈ ప్రక్రియకు వినియోగించుకోనున్నారు. జిల్లాలోని ఆయా పాఠశాలకు సంబంధించిన సీనియర్ హెచ్‌ఎంలను ఈ ప్రక్రియకు తీసుకున్నారు. బదిలీలు పదోన్నతులు అయ్యేవరకు సంబంధిత సీనియర్ హెచ్‌ఎం ఇక్కడ పని చేయనున్నారు.

12న మెగా జాబ్‌మేళా

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర వద్ద ఏఎన్‌జీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 12న నిర్వహించే మెగా జాబ్‌మేళాను బాల్కొండ నియోజకవర్గ యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన వేల్పూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జాబ్‌మేళాలో 70 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 4 వేల మందిని నియమించుకునే అవకాశం ఉందన్నారు. ఎస్సెస్సీ మొదలుకొని ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, హోటల్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కోర్సులు, కంప్యూటర్, నర్సింగ్ కోర్సులు చేసిన వారు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే వారికి ఎటువంటి రుసుము లేదని, సోషల్ మీడియాలో విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, నమోదు చేసుకుంటే సరిపోతుందన్నారు. ఇప్పటికే సుమా రు 1400 మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆసరా ఫౌండేషన్ చైర్మన్ శివశంకర్, నాయకులు రేగుల్ల రాములు, రాకేశ్‌చంద్ర, నాగధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైస్‌మిల్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి : నవీపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాల్దాలో వెంకటలక్ష్మి రైస్‌మిల్‌పై పౌర సరఫరాల శాఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఖరీఫ్, రబీ సీజన్‌లో సివిల్ సప్లయ్ శాఖ పంపిన ధాన్యాన్ని తిరిగి శాఖకు అప్పగించకపోవడంతో డీఎస్‌వో ఫిర్యాదు మేరకు రైస్‌మిల్ యాజమాని గోపాలకృష్ణపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. తాము పంపిన ధాన్యం తిరిగి ఇవ్వాలని సివిల్ సప్లయ్ శాఖ నుంచి వెంకటలక్ష్మి రైస్‌మిల్‌కు నోటీసులు ఇచ్చినప్పటికీ ధాన్యం ఇవ్వకపోవడంతో శాఖాధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ. 9 కోట్ల ధాన్యం ఇవ్వాల్సి ఉన్నట్లు సమాచారం. బుధవారం రాత్రి నార్త్ సీఐ సతీష్‌తో పాటు తహసీల్దార్ రైస్‌మిల్‌కు వెళ్లి తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై నార్త్ సీఐ సతీష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీజేపీ టికెట్ కోసం ధన్‌పాల్ దరఖాస్తు



టికెట్ కోసం దరఖాస్తు సమర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ

సాక్షి, ప్రతినిధి, నిజామాబాద్ : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి తన దరఖాస్తును సమర్పించారు. ధన్‌పాల్ సూర్యనారాయణ 30ఏళ్లుగా విశ్వ హిందూ పరిషత్‌లో పనిచేస్తున్నారు. 2014లో రాజకీయాల్లోకి వచ్చిన ధన్‌పాల్ అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. తాజాగా దరఖాస్తు సమర్పించేందుకు జిల్లా కేంద్రం నుంచి నాయకులు, కార్పొరేటర్లతో కలిసి భారీ కాన్వాయ్‌తో తరలివెళ్లారు. ధన్‌పాల్‌తో పాటు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి వినోద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగొల్ల లక్ష్మీనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, కార్పొరేటర్లు సుక్క మధు, మాస్టర్ శంకర్, బంటు రాము, మీసేవ శ్రీనివాస్, పంచరెడ్డి ప్రవళిక, శ్రీధర్, బూరగుల ఇందిరా వినోద్, ఇల్లందుల ప్రభాకర్, మోర్చా అధ్యక్షులు శివ ప్రసాద్, ఖైసర్, నాయకులు బుస్సాపూర్ శంకర్, గడ్డం రాజు, పుట్టా వీరేందర్, రోషన్ లాల్, గంగోని గంగాధర్, సర్పంచ్ గంగన్న, రవి కుమార్, షీలా శ్రీనివాస్, జస్పాల్ సింగ్, భూపతి, కొత్త వే ణు, బద్దంకిషన్, రంజిత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. జిల్లా మీదుగా రెండు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తుండటం వల్ల తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటికి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ, ప్రమాదాలకు దారి తీస్తున్న కారణాలను గుర్తించాలన్నారు. పోలీస్, ఆర్‌అండ్‌బీ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జాయింట్ సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలకు మూల మలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం వంటి కారణాలను గమనిస్తే, వాటిని వెంటనే సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారమున్న ప్రాంతాల్లో సైన్ బోర్డులు పెట్టాలని, ఆర్టీసీ డ్రైవర్లు సహా, ఇతర ప్రైవేట్ వాహనాల ఆపరేటర్లకు రోడ్డు భద్రతా చర్యలు విధిగా పాటించేలా అవగాహన కల్పించాలన్నారు.

డివైడర్లు, ఐలాండ్‌లతో సమస్యలుంటే గుర్తించాలన్నారు. నగరంలో వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరందు, డీటీసీ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధి బుస్సా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ భవనాల పరిశీలన

నిజామాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ధర్మపురి హిల్స్ వద్ద కొనసాగుతున్న ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాల పనులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం పరిశీలించారు. నగరంలో ఏడు మైనారిటీ పాఠశాలలు కొనసాగుతుండగా, వాటిలో బాలికల కోసం ఒకే చోట ధర్మపురి హిల్స్ వద్ద నాలుగు స్కూళ్లకు పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. వాటిలో ఇప్పటికే ఒక నిర్మాణం పూర్తవ్వగా మరో మూడు పాఠశాలల పనులు తుది దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ భవనాల్లో తరగతి గదులు, డార్మెటరీ, లైబ్రరీ, ల్యాబ్‌రూంలు, కిచెన్, డైనింగ్ హాల్, రాంప్, టాయిలెట్స్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు, గుత్తేదారుకు సూచనలిచ్చారు. గడువులోగా, నాణ్యతతో పనులు పూర్తవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఇంజినీరింగ్ విభాగం ఈఈ దేవిదాస్, ఏఈ ఉదయ్ ఉన్నారు.



నగరంలోని కోర్టు చౌరస్తా వద్ద నిలిచిన నీరు



దంచికొట్టిన వాన

సుభాష్‌నగర్ : జిల్లాలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షానికి నిజామాబాద్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతం కావడంతో సాయంత్రం ఆరు గంటలకే చీకట్లు కమ్ముకున్నాయి. సుమారు గంట పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది.

విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి

- రైతులు, వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

TSNPDCL

నిజామాబాద్ నాగారం : మరో ఐదు రోజులు అతి భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారుల, రైతులు అప్రమత్తంగా ఉండాలని పలు జాగ్రత్తలు తీసుకోవాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్ రావు తెలిపారు. జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ దగ్గరలో, ఇంట్లో గాని తడిచేతులతో విద్యుత్ పరికరాలను, తీగలను ముట్టుకోవద్దన్నారు. ముఖ్యంగా దుస్తులు ఆరేసే దండెంలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ ఉన్న వైర్లకు ఎలాంటి అతుకులు లేకుండా చూసుకోవాలన్నారు. ఒకవేళ అలాంటి అతుకుల వైర్లను వెంటనే అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్లతో సరి చేయించాలన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లవద్దని, స్టార్టర్ డబ్బాలను నీటిలో తడవకుండా పైకి ఏర్పాటు చేసుకోవాలన్నారు. లోఓల్టేజీ హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్‌శాఖ వారికి తెలియజేయాలన్నారు. ఆరుబయట విద్యుత్ స్తంభాలను తాకవద్దన్నారు. తెగి పడిన, వేలాడుతున్న, వదులుగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదన్నారు. ఎవరికైనా కరెంట్ షాక్ కొడితే నేరుగా ఆ వ్యక్తిని ముట్టుకోవద్దని, విద్యుత్ సరఫరా నిలిపేసి, కర్ర ప్లాస్టిక్ వస్తువుతో అతడిని తీగ నుంచి వేరుచేయాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్తింగ్ చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయన్నారు. గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్ర స్థాయి విద్యుత్ సిబ్బందికి లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సబ్ ఇంజినీర్, సెక్షన్ ఆఫీసర్(ఏఈ)ను సంప్రదించి వారి సేవలను పొందాలన్నారు. జీపీ పరిధి, సెక్షన్ ఆఫీసుల్లో విద్యుత్‌శాఖ అధికారుల సెల్‌ఫోన్ నంబర్లను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 0028 కు లేదా 1912కు ఫోన్ చేయాలన్నారు.

క్లుప్తంగా

అలీసాగర్ నీటి విడుదల



ఎడపల్లి (బోధన్): ఎడపల్లి మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్ నిండు కుండలా మారింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నిజాంసాగర్ ప్రధాన కెనాల్‌లోకి భారీ వరద చేరింది. దీంతో అధికారులు 300 క్యూసెక్కుల నీటిని రిజర్వాయర్‌లోని ఒక్క గేట్ ద్వారా దిగువకు వదులుతున్నారు.

పీజీ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

మోపాల్(నిజామాబాద్‌రూరల్): టీయూ పరిధిలోని పీజీ బ్యాక్‌లాగ్ పరీక్షల తేదీలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ బుధవారం తెలిపారు. పీజీ 1, 3, 5వ సెమిస్టర్ (థియరీ, ప్రాక్టికల్) బ్యాక్‌లాగ్ పరీక్షలు ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎం.కామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్‌ఎల్‌బీ, ఏపీఈ, ఐఎంబీఏ, ఐపీసీహెచ్, బీఎల్ఐఎస్‌సీ కోర్సుల విద్యార్థులు ఈ నెల 12వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించాలన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 15 వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నిశిత కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



నిజామాబాద్‌అర్బన్: నిశిత డిగ్రీ కళాశాలలో బుధవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో 400 మంది విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్ష రాయగా కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ రాజు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేకడ్రైవ్‌లో ఎంతోమంది విద్యార్థులు ఉద్యోగం పొందుతుండడంతో తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సీపీ సత్యనారాయణ



ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి సీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

మొదలైన ఐసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఐసెట్ కౌన్సెలింగ్ బుధవారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఈనెల 11వ తేదీ వరకు కౌన్సిలింగ్ కొనసాగుతుందని కౌన్సెలింగ్ కన్వీనర్ శ్రీరామ్‌కుమార్ తెలిపారు. ఈనెల 12వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు కళాశాలల ఎంపిక ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ నెల 20 తేదీలోపు ఆయా కళాశాలల్లో ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఐసెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోలు, బోనాఫైడ్‌లు, టీసీ, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

సమస్యల వలయంలో బోధన్ స్టేషన్

- పలు రైళ్లకు టికెట్లు అందించాలని ప్రయాణికుల విజ్ఞప్తులు
- కనికరించని రైల్వే అధికారులు
- డీజీఎంకు విన్నవించిన దక్కని ఫలితం



డీఆర్ఎం శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు (ఫైల్)



బోధన్‌లోని రాకాసిపేట్ రైల్వే స్టేషన్

బోధన్‌టౌన్(బోధన్): ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోధన్ రైల్వే స్టేషన్ ప్రస్తుతం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పలు రైళ్లకు బోధన్‌నుంచి టికెట్లు అందించాలని, పలు రైళ్లను కొనసాగించాలని స్థానికులు రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. ఫలితంగా బోధన్ ప్రజలు రైల్వే ప్రయాణానికి అనాసక్తి చూపిస్తున్నారు.

దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డీఆర్ఎంలు మారినా బోధన్‌లోని రైల్వేస్టేషన్లతో పాటు, రైళ్ల రాకపోకల సమస్యలు మాత్రం మారడం లేదు. బోధన్ – మిర్జాపల్లి ప్యాసింజర్ రైలును పునఃరుద్ధరించాలని, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలుకు బోధన్ నుంచి టికెట్ ఇవ్వాలని, బోధన్ – కరీంనగర్ డెమో రైలుకు టికెట్ అందించాలని, బోధన్, రాకాసీపేట్ రైల్వే స్టేషన్లలో టికెట్ బుక్కింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలుతో పాటు నిజామాబాద్ – కరీంనగర్ రైలును బోధన్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభించాలని దీంతో పాటు పలు రైళ్ల రాకపోకలను పెంచి, టికెట్ బుక్కింగ్ కార్యాలయం ఏర్పాటు చేసి స్టేషన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బోధన్‌కు ఇప్పటి వరకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ మేనేజర్లు ప్రసాద్, శరత్‌చంద్ర, జీమ్ గజానంద్ మాల్యా, ఇటీవల రైల్వే స్టేషన్ పరిశీలనకు వచ్చిన ప్రస్తుతం డీజీఎం లోకేశ్ విష్టోయ్‌కు విన్నవించినా ఫలితం దక్కలేదు. ఫలితంగా బోధన్ నుంచి రైలు ప్రయాణానికి ప్రజలు అనాసక్తి చూపుతున్నారు. బోధన్‌కు అతి చేరువలో మహారాష్ట్రతో పాటు కర్ణాటక రాష్ట్రాలు పక్కనే ఉండడంతో బోధన్ వ్యాపార కేంద్రంగా మారింది. బోధన్‌కు వ్యాపార నిమిత్తం రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు పలు రైళ్ల సౌకర్యాలు, బుక్కింగ్‌సెంటర్లను ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్వోబీల ఊసేలేదు..

బోధన్‌కు రైలు వచ్చినప్పుడుల్లా పట్టణంలోని గాంధీ పార్కు వద్ద గేటు పడడంతో గంటల తరబడి ప్రజలు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేట్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు మంజూరై, సాయిల్ టెస్టు పూర్తయినా ఇప్పటి వరకు ఆర్‌వోబీ నిర్మాణ ఊసే లేకుండా పోయింది. ఇకనైనా ఎంపీ, రైల్వే అధికారులు స్పందించి బోధన్ నుంచి ప్రారంభమై వెళ్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్, పెద్దపల్లి రైళ్లకు ఇక్కడే టికెట్లు ఇచ్చి ప్రయాణికులు ప్రయాణించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రాయలసీమ రైలుకు టికెట్లు ఇవ్వాలి



బోధన్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమై వెళ్లే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ తిరుపతి రైలుకు ఇక్కడి నుంచే టికెట్లు ఇచ్చి ప్రయాణికులు ప్రయాణించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. రద్దయిన బోధన్–మిర్జాపల్లి రైలును పున:రుద్ధరించాలి.

–శివకుమార్, విద్యార్థి సంఘం నాయకులు

ఆర్వోబీని నిర్మించాలి



బోధన్‌కు వచ్చే రైళ్లరాకపోకలతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్వోబీ లేక పోవడంతో గేటు గంటల తరబడి మూసి వేయి ఉండడంతో ఇబ్బందిగా మారుతోంది. రైల్వే అధికారులు, ఎంపీ స్పందించి నిర్మాణ పనులు చేపట్టాలి.

–ఖలీం, వ్యాపారి

ఎస్సారెస్పీకి పర్యాటకుల తాకిడి



గోదావరిలో ఉల్లాసంగా గడుపుతున్న పర్యాటకులు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

బాల్కొండ: ఎస్సారెస్పీకి పర్యాటకుల తాకిడి పెరిగింది. ప్రాజెక్టు గేట్లను అధికారులు విడుదల చేయడంతో వీక్షించడానికి జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు బుధవారం పెద్ద సంఖ్యలో వచ్చారు. ప్రాజెక్టు అందాలను వీక్షిస్తూ సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. పర్యాటకుల తాకిడి ఎక్కువ కావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గతంలో మాదిరి కింది గేటు వద్దే కాకుండా పర్యాటకులను అనుమతించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజారెడ్డి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పాక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది మాదస్తు రాజారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాజారెడ్డి మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. రాజారెడ్డి రెండుసార్లు నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు. నిజామాబాద్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి బాగి చరణ్, లైబ్రరీ కార్యదర్శి బాలరాజ్ నాయక్, రాజారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రైం కార్నర్

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

- మూత్రవిసర్జన చేస్తుండగా ఫొటో తీసిన మహిళ
- భర్తతో పంచాయితీ పెట్టించడంతో మనస్తాపానికి గురై బలవన్మరణం



ప్రమోద్ (ఫైల్)

మాక్లూర్(ఆర్మూర్): ఓ మహిళ చేసిన ఆరోపణలతో అవమానాన్ని తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడో యువకుడు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామానికి చెందిన మేతరి ప్రమోద్(18) ఈనెల 4న తన ఇంటికి కొద్ది దూరంలో మూత్ర విసర్జన చేశాడు. సమీపంలో నివసించే ఓ మహిళ తన సెల్‌ఫోన్‌లో ఫొటోతీసి.. రోజు నన్ను చూస్తూ నా ఎదుటే మూత్ర విసర్జన చేస్తున్నాడంటూ ఆ ఫొటోను భర్తకు చూపించింది. దీంతో ఆయన కుల పెద్దలతో పంచాయితీ పెట్టించాడు. తాను ఉద్దేశపూర్వకంగా అక్కడ మూత్ర విసర్జన చేయలేదని, వర్షం పడుతుండడంతో అలా చేశానని ప్రమోద్ చెప్పినా వినకుండా తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రమోద్.. అదే రోజు ఆర్మూర్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లి ఆర్మూర్ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని స్నేహితులకు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పి నిప్పంటించుకున్నాడు. ప్రమోద్ స్నేహితులు ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులకు తెలిపి సంఘటన స్థలానికి వెళ్లేసరికి తీవ్రంగా గాయపడి ఉన్నాడు. వెంటనే అంబులెన్స్‌లో ఆర్మూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ప్రమోద్ తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం కాగా ప్రమోద్ చివరివాడు. తల్లి చిన్నప్పుడే మృతిచెందగా నాన్నే పెంచాడు. ప్రమోద్ ఇంటర్ పూర్తిచేసి ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ విషయమై ఆర్మూర్ సీఐ సురేష్‌బాబును వివరణ కోరగా కేసు నమోదు చేశామని, మాక్లూర్‌కు కేసును బదిలీ చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి హత్య

- వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కోపంతో..
- మంజీరాలో మృతదేహాన్ని పారేసిన నిందితుడు



శివకుమార్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివకుమార్(45) అదృశ్యమైనట్లు అతని తండ్రి గంగారాం ఆగస్టు 20న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో గ్రామంలోని మసూద్‌పై అనుమానం రావడంతో పీఎస్‌లో విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. శివకుమార్ భార్యతో మసూద్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలిపారు. దీంతో అడ్డుగా ఉన్న శివకుమార్‌ను హత్య చేసేందుకు పథకం రచించాడు. జూలై25న మద్యం తాగేందుకు ఇద్దరు బైక్‌పై మహారాష్ట్రలోని బిలోలి మండలం నాగిని శివారులోని ఉన్న మంజీరా సమీపంలో మద్యం తాగారు. పూర్తి మైకంలో ఉన్న శివకుమార్‌ను బండరాయితో తలపై మోది హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే మంజీరాలో పడేసినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శర్బతీకెనాల్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ బుధవారం తెలిపారు. కాలనీలో యువకులు ఘర్షణకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించి నలుగురు యువకులు సయీద్, యాసిన్, అమీర్, ఇర్ఫాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘర్షణ ప్రేమ వ్యవహారంగా భావిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాలిక దత్తతపై విచారణ

అనారోగ్యం, పేదరికంతో విక్రయించినట్లు నిర్ధారణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ తన ఏడేళ్ల కూతురును రూ.30 వేలకు విక్రయించారంటూ బుధవారం సోషల్‌మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు పోలీసులతో కలిసి విచారణ చేపట్టారు. అధికారుల విచారణలో బాలికను దత్తత ఇచ్చిన మాట వాస్తమేనని, బాలిక తల్లి సైతం అనారోగ్యానికి గురికావడంతో రూ. 30 వేలకు తల్లి విక్రయించినట్లు తెలిసింది. మండల కేంద్రానికి చెందిన ఓ నిరుపేద మహిళకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా చిన్న కూతురు పుట్టిన 3 రోజులకే పెంచుకునేందుకు ఆమె సమీప బంధువులకు అప్పగించినట్లు తెలిసింది. కాగా ఏడేళ్ల వయసున్న పెద్ద కూతురును సుమారు 15రోజుల క్రితం లింగంపేట మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన దంపతులకు దత్తత ఇచ్చినట్లు తెలిసింది. బాలిక తల్లి ఆరోగ్యం బాగాలేకపోవడంతోపాటు పేదరికం కారణంగా దత్తత తీసుకున్న దంపతులు రూ.30వేలు ఇచ్చినట్లు సమాచారం. ఇందుకు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మధ్యవర్తిత్వం వహించినట్లు అధికారుల విచారణలో తేలింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి బుధవారం బాలికను దత్తత ఇచ్చిన మహిళ ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. విచారణ పూర్తయితే బాలికల దత్తతకు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కారును ఢీకొన్న లారీ



ఘటనాస్థలిలో కారు

భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కారును లారీ ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొనడంతో మూడు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

వరిని ఆశిస్తున్న ఎండాకు తెగులు



బొప్పాపూర్ శివారులో రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



వరి పంటను ఆశించిన ఎండాకు తెగులు

రుద్రూర్: వాతావరణ ప్రభావం, యూరియా వినియోగం పెరగడంతో వరి పంటలో బాక్టీరియా ఎండాకు తెగులు ఆశిస్తోందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. రుద్రూర్ మండలం బొప్పాపూర్ శివారులో పొలాలను బుధవారం శాస్త్రవేత్తలు బీవీ రాజ్‌కుమార్, పి విజయ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఈ తెగులు సాగు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుందని, ఆశించిన పొలం నుంచి ఇతర పొలాలకు నీరు పారకుండా చూడాలన్నారు. తెగులు లక్షణాలు ఐదు శాతం కంటే ఎక్కువైతే నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. తెగులు లక్షణాలు దుబ్బు కట్టే దశలో గమనిస్తే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా., ప్లాంటామైసిన్ (లేదా) పోషామైసిన్ (లేదా) అగ్రిమైసిన్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే తెగులు వ్యాప్తిని కొంత వరకు నియంత్రించవచ్చునని వివరించారు. ఈ తెగులును పూర్తిగా నివారించడానికి మందులు అందుబాటులో లేనందున సమగ్ర ఎరువుల యాజమాన్యంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం, హుమ్నాపూర్ విండో మాజీ వైస్ చైర్మన్ బాపూజీ లింగం, రైతులు గంగాధర్, స్వామి, కృష్ణ, శ్రీనివాస్, సాయిలు ఉన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



రైతు కుంట మోహన్‌కు బైబ్యాక్ గ్యారంటీ పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

సిరికొండ: ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు పంట సాగులో మెలకువలు పాటించాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి నర్సింగ్‌దాస్ తెలిపారు. మండలంలోని గడ్కోల్ రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నేలలో నీరు నిలువకుండా చూసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్‌లో సాగు చేసే అంతర పంటల గురించి రైతులకు అవగాహన కల్పించారు. గడ్కోల్‌కు చెందిన రైతు మోహన్ గతేడాది పంటను సాగు చేయగా పంట కొనుగోలుకు బైబ్యాక్ గ్యారంటీ పత్రాన్ని ఆయనకు అధికారులు అందజేశారు. నిజామాబాద్ రూరల్ ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్యారాణి, డీజీఎం రామ్మోహన్‌రావు, సర్పంచ్ దేవాగౌడ్, ఎంపీటీసీ గంగారాం, ఏఈవోలు శివాణి, రోచన, రైతులు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే!



చిత్తడిమయంగా మారిన రోడ్డు

- బురదమయంగా మారుతున్న మాధవ్‌నగర్ రోడ్డు
- ఆర్వోబీ పనులతో వాహనదారులకు ఇక్కట్లు



కొనసాగుతున్న ఆర్వోబీ పనులు

నిజామాబాద్‌రూరల్: వర్షం కురిస్తే వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. చినుకు పడితే చాలు మాధవ్‌నగర్ రైల్వేగేట్ వద్ద రోడ్డు బురదమయంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.93.12 కోట్లతో చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు మాధవ్‌నగర్ వద్ద కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వర్షం పడితే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. ఓ వైపు బ్రిడ్జి పనులు, మరోవైపు బురదమయంగా మారిన రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పక్కనే ఉన్న సాయిబాబా ఆలయంలోకి నీరు చేరుతోంది. రోడ్డు చిత్తడిగా మారి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్వోబీ పనులు పూర్తి కావాలంటే మరో ఏడాదిన్నర పడుతుందని ఇంజినీర్లు తెలిపారు. పనులు వేగంగా పూర్తి చేయాలని, భారీ వాహనాలను ఈ మార్గంలో అనుమతించొద్దని ప్రజలు కోరతున్నారు. అప్పటి వరకు బురదమయంగా మారిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి. వంతెన పనులు పూర్తయితే ఆలయంలో దుమ్ము పడకుండా ఉంటుంది.

– శ్రీరామ్ రవీందర్ గుప్తా, సాయిబాబా ఆలయ ఈవో

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన నెట్‌బాల్ క్రీడాకారుల జట్లు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెన్, ఉమెన్ విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలను నగరంలోని అభ్యాస స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వరకు నిర్మల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రమేశ్, కోశాధికారి గంగాధర్, సభ్యులు రాజేశ్వర్, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు. జట్టుకు మేనేజర్లుగా సునీల్, రమేశ్‌గౌడ్, కోచ్‌లు వెంకటేశ్వర్‌రావు, ఎ. రమేశ్ వ్యవహరించనున్నారు.

ఎంపికైన వారిలో..

అనిల్‌కుమార్, విజయకాంత్, స్వామి, నవీన్, ధనుష్, ప్రణయ్‌రెడ్డి, జగదీశ్, అజయ్‌కుమార్, శుశాంత్, శ్రావణ్, మధు, అరోణ్, మనితేజ, హరీశ్, శ్రావణి, లేయ, సుమయ్య, కార్తీక్, మహేశ్వరీ, రవీనా, మనస్వీ, సుహాణి, హరిణి, శ్రీజ, రిషిక, ప్రణవి, హేమశ్రీ, మహియ, త్రిశల్ ఎంపికయ్యారు.

క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి కృషి

నిజామాబాద్ నాగారం : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని నాపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. చైర్మన్‌గా పదవి ఇచ్చినందుకు మొదటిసారిగా జిల్లాకు వచ్చినందున జిల్లాలోని బీఆర్ఎస్, క్రిస్టియన్ ప్రతినిధులు ప్రత్యేకంగా స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో చైర్మన్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఫాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నిస్సి జాన్సన్, మాజీ అధ్యక్షులు ఫాస్టర్ జోసెఫ్, ఎబిసీసీ ప్రెసిడెంట్ వైఆర్ డేవిడ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి టౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీనివార్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామని, అపరిచిత వ్యక్తుల నుంచి నగ్న వీడియో కాల్స్ వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా, బ్యాంక్ ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ పెట్టుకోవాలని కోరారు. ఓటీపీలను ఇతరులకు షేర్ చేయద్దన్నారు. అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే www.cybercrime.gov.inను లేక 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.